సాక్షి నిర్మల్
శుక్రవారం । 2 । జూన్ । 2023



'ఆశ్రమ' సీఆర్టీలకు తీపి కబురు

ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురుచెప్పింది. ఏడాది కా లంపాటు పూర్తి వేతనం ఇవ్వాలని నిర్ణయించింది.

8లో▸



అయోమయంలో అన్నదాతలు

కష్టపడి పంటలు సాగు చేసే అన్నదాతలకు కాల మేదైనా కష్టాలు తప్పడం లేదు. అమ్మబోతే అడవి కొనబోతె కొరివిలా మారింది రైతుల పరిస్థితి. మారింది.

9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.4 /29.5

ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు ఉంటాయి. ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కబోత అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

స్వరాష్ట్రంలో సస్యశ్యామలం

- జిల్లా ఏర్పాటుతో నిర్మల్ మరింత అభివృద్ధి
- మెడికల్ కాలేజీ సహా ఎన్నో సాధించాం
- మున్ముందు మరింత ముందుకెళ్తాం
- అన్నిరంగాలు, వర్గాలనూ బలోపేతం చేస్తాం
- దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: 'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే నిర్మల్ జిల్లా సస్యశ్యామలమైంది. ప్రత్యే క జిల్లాగా ఏర్పడిన తర్వాత గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే చాలా జిల్లాల కంటే నిర్మల్ ముందంజలో ఉంది. మెడి కల్ కాలేజీసహా ఎన్నో అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్ జిల్లాకు ఇచ్చా రు. ఇకముందూ నిర్మల్ ప్రగతికి మరింతగా రాష్ట్రప్రభుత్వం సహకరిస్తుంది. తెలంగాణ అవతరణ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం. ఉద్యమాన్ని గుర్తుచేస్తూ.. సాధించిన ప్రగతిని చాటుతూ.. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధించేలా.. ఈ కార్యక్రమాలు చేపడతాం..' అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లో ల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ ద శాబ్ది ఉత్సవాల సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

సాక్షి : తెలంగాణ ఏర్పాటుతో నిర్మల్‌లో వచ్చిన మార్పు..

మంత్రి : సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఉవ్వెత్తున సాగిన తెలంగాణ ఉద్యమం రాష్ట్ర ఏర్పాటుతోపాటు ఈ ప్రాంత రూపురేఖలనే మార్చేసింది. ప్రధానంగా నిర్మల్‌ప్రాంతం గతంలో ఎన్నడూ.. ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి సాధించింది. ఇంకా మున్ముందు మరెంతో ప్రగతిని సాధించనుంది.

సాక్షి : జిల్లా ఏర్పాటు ఏవిధమైన మార్పులు తెచ్చింది..

మంత్రి : స్వరాష్ట్ర సాధించుకున్నదే స్వపరిపాలన కోసం అందులో భాగంగానే ప్రజలకు మరింత చేరువుగా జిల్లా అధికారులు ఉండాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ చిన్న జిల్లాలను ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా కావడంతో ఆదిలాబాద్ వరకు వెళ్లే దూరభారం తప్పింది. ఏ పని ఉన్నా ఒక్కరోజులోనే పూర్తిచేసుకునే సౌలభ్యం ఏర్పడింది. మన నిధులు–అభివృద్ధి పథకాలు మన ప్రాంతానికే దక్కుతున్నాయి.

సాక్షి : మీ మంత్రిత్వ శాఖల పరంగా..

మంత్రి : సీఎం కేసీఆర్ నాకు కేటాయించిన మూడు శాఖల ద్వారా సొంత జిల్లాకు ప్రాధాన్యత ఇస్తున్నాను. సమైక్యాంధ్ర పాలనలో కనీసం దేవాలయాలను పట్టించుకోలేదు. నేను మంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలతోపాటు దాదాపు 1,500 గుళ్లను అభివృద్ధి చేస్తున్నా. నిర్మల్ జిల్లాలోనే 500పైగా ఆలయాలకు మహర్దశ తెచ్చాం. అడెల్లి పోచమ్మ, దిలావర్‌పూర్ ఎల్లమ్మ నూతన ఆలయాలను నిర్మిస్తున్నాం. బాసరను కూడా ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నాం. న్యాయశాఖ పరంగా జిల్లాకేంద్రంలో జిల్లాకోర్టు వచ్చేలా కృషిచేశాను. కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణం కూడా త్వరలోనే ప్రారంభం కానుంది. అటవీశాఖ ద్వారా పోడు భూములకు పట్టాల సమస్య కూడా కొలిక్కిరానుంది. అటవీ జంతువుల ద్వారా నష్టపోయిన వారికీ పరిహారం ఇప్పించాం.

సాక్షి : తొమ్మిదేళ్లలో జిల్లా సాధించిన ప్రగతి...

మంత్రి : ఈ తొమ్మిదేళ్లలో మునుపెన్నడూ లేనంత ప్రగతి సాధించాం. గతంతో పోల్చుకుంటే.. నిర్మల్ జిల్లాలో ఎన్నో పనులను చేపట్టాం. ప్రధానంగా మెడికల్ కాలేజీ రావడంతో జిల్లావాసుల అదృష్టం. అలాగే ఈనెల 4న సీఎం చేతుల మీదుగా అన్ని శాఖలు ఒకే దగ్గర ఉండేలా సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించబోతున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎప్పటికప్పుడు సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ కాలువలు, సదర్మట్ బ్యారేజీ నిర్మాణం ఇవన్నీ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు గురుకులాలను నిర్మించుకున్నాం. బాసర సరస్వతీమాత ఆలయాన్నీ ఆధునికీకరిస్తున్నాం. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేలా సోన్ మండలంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే జిల్లాలో వ్యవసాయ అనుబంధ ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. మున్సిపాలిటీలలో పారిశుధ్య పనులతోపాటు సుందరీకరణ పనులూ చేపట్టాం. అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు అందేలా నిర్మాణాలు చేపడుతున్నాం.

సాక్షి : ముఖ్యమంత్రి దృష్టికి ఏమేం తీసుకెళ్తారు..

మంత్రి : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 4న జిల్లాకు వస్తున్నారు. నిర్మల్‌లో సమీకృత కలెక్టరేట్, బీఆర్ఎస్ భవన్‌ల ప్రారంభంతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఎన్నికల హామీలో భాగంగా జిల్లాకు మెడికల్ కాలేజీ ఇచ్చారు. ఇంకా మిగిలిన హామీలనూ పూర్తిచేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను. సీఎం కార్యక్రమంతోపాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని, జిల్లాప్రగతిలో తోడ్పాటు అందించాలని జిల్లావాసులందరినీ కోరుతున్నాను. అందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు.

ఆరోగ్య కేంద్రాలకు అవార్డుల పంట

- ఉత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా దిలావార్‌పూర్
- ఉత్తమ అర్బన్ హెల్త్ సెంటర్‌గా బంగల్‌పేట్
- 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రోత్సాహక బహుమతులు
- 11వ స్థానంతో సరిపెట్టుకున్న జిల్లా ఆసుపత్రి



బంగల్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ఆరోగ్యశాఖ అందించే కాయకల్ప అవార్డుల్లో జిల్లా పంట పండింది. ఏకంగా 10 పీహెచ్సీలు, మూడు అర్బన్ పీహెచ్సీలు, ఐదు సబ్ సెంటర్లు అవార్డులు గెలుచుకున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్వచ్ఛతను ప్రో త్సహించేందుకు కేంద్రం 2015లో ఈ అవార్డులను ప్రవేశపెట్టింది. స్వచ్ఛభారత్ అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 2022–23కి సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై వైద్య ఆరోగ్యశాఖ బుధవారం అవార్డు ఫలి తాలు విడుదల చేసింది. శుభ్రత, శానిటేషన్, రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న ఆస్పత్రులను ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

పురస్కారాలు ఇలా...

రాష్ట్ర ప్రభుత్వ జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆసుపత్రుల పని తీరును బట్టి కాయకల్ప అవార్డు కింద ఏటా ప్రథమ, ద్వితీయ బహుమతుల తోపాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొదటి బహుమతి సాధించిన జిల్లా ఆసుపత్రులకు రూ.50 లక్షలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు రూ.15 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.2 లక్షలు, సబ్ సెంటర్లకు రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం అందిస్తోంది. ఈఏడాది జిల్లాలో పలు ఆరోగ్య కేంద్రాలు ఈ అవార్డుకు ఎంపికయ్యాయి.

గతేడాది ఫస్ట్... ఇప్పుడు ప్రోత్సాహకం

రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ కాయకల్ప అవార్డుల కోసం రాష్ట్రంలో ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలకు మార్కులు ఇచ్చింది. గతేడాది నిర్మల్ ఆసుపత్రి 92 శాతం మార్కులతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. కానీ ఈ సంవత్సరం 13 జిల్లా ఆస్పత్రులు ఎంపిక కాగా, నిర్మల్ జిల్లా ఆసుపత్రి 72.93 శాతం మార్కులతో 11వ స్థానంలో నిలిచి ప్రోత్సాహక బహుమతి కేటగిరీలో రూ.3 లక్షలు గెలుచుకుంది.

ఉత్తమ పీహెచ్‌సీగా..

రాష్ట్రంలో ఉత్తమ సేవలందిస్తున్న పీహెచ్‌సీలకు సైతం అవార్డులను ప్రకటించారు. ఈ విభాగంలో 90 శాతం మార్కులతో దిలావర్‌పూర్ పీహెచ్‌సీ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రూ.2 లక్షల నగదు, సర్టిఫికెట్ అందజేయనున్నారు. జిల్లాలోని ముజ్గి 87, దస్తురాబాద్ 86, కుభీర్ 86, వెల్మల్ బొప్పారం 83, బాసర 81, తానూర్ 81, సోన్ 79, కుంటాల 79, లోకేశ్వరం 76 మార్కులతో ప్రోత్సాహక బహుమతులు దక్కించుకున్నాయి. ప్రోత్సాహక బహుమతి కింద ఈ పీహెచ్‌సీలకు రూ.50 వేల నగదు పురస్కారం అందిస్తారు.

వరుసగా రెండవసారి...

ఉత్తమ అర్బన్ హెల్త్ సెంటర్‌గా నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీ అర్బన్ సెంటర్ 88 మార్కులతో ప్రథమ స్థానం పొందింది. గతంలో కూడా ఈ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ 73 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో మరోసారి ఈ కేంద్రానికి రూ.2 లక్షల నగదు పురస్కారం అందనుంది. ప్రోత్సాహక బహుమతిగా రాంనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ 85, బైంసా అర్బన్ హెల్త్ సెంటర్ 80 మార్కులతో రూ.50 వేల నగదు పురస్కారానికి ఎంపికయ్యాయి.

ఉత్తమ ఉపకేంద్రంగా కడ్తాల్...

ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపకేంద్రంగా సోన్ మండలం కడ్తాల్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు రూ.లక్ష ఇవ్వగా, బీరవెల్లి హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఫస్ట్ రన్నరప్‌గా రూ.50 వేలు, సెకండ్ రన్నరప్‌గా మాదాపూర్ సెంటర్‌కు రూ .35 వేలు గెలుచుకున్నాయి. ప్రోత్సాహక బహుమతుల కింద ఖానాపూర్, చిట్యాల్ వెల్‌నెస్ సెంటర్లకు రూ.25 వేల చొప్పున అందనున్నాయి. హైదరాబాద్‌లో అవార్డులను ప్రదానం చేస్తారు.

జిల్లాకు కాయకల్ప అవార్డు కింద వచ్చిన నగదు వివరాలు...

మొత్తం జిల్లాకు వచ్చిన నగదు రూ.14.85 లక్షలు
జిల్లా ఆసుపత్రికి రూ.3 లక్షలు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు :6.50 లక్షలు
అర్బన్ హెల్త్ సెంటర్లకు: 3లక్షలు
ఆరోగ్య ఉప కేంద్రాలకు:2.35 లక్షలు

సమష్టి కృషికి ఫలితం..

దిలావర్‌పూర్ పీహెచ్‌సీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో ఈఘనత సాధ్యమైంది. అవార్డు మా బాధ్యతను మరింత పెంచుతుంది.

– డాక్టర్ శ్యామ్‌కుమార్, దిలావర్‌పూర్ వైద్యాధికారి

న్యూస్‌రీల్

10న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు భైంసా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.దేవేంద్రబాబు అన్నారు. కోర్టు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పోలీసు, బ్యాంకు అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో రాజీతో పరిష్కారమయ్యే అపరిష్కృత కేసులతో కోర్టు చుట్టూ తిరుగుతున్నవారికి లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు శ్రీను, చంద్రశేఖర్, వినోద్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించాలి



మాట్లాడుతున్న చావ రవి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీలు వెంటనే నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో గురువారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవి హాజరై మాట్లాడారు. ఉద్యోగుల కుటుంబ ఆరోగ్య సంరక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశామని అందులో చేరిన ఉపాధ్యాయులు దురదృష్టవశాత్తు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత సంఘం తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి వెంకట్, రాష్ట్ర నాయకులు లక్ష్మణరావు, ఆదిలాబాద్ జిల్లా బాధ్యులు స్వామి, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, నాయకులు పెంటా అశోక్, నాగయ్య, రాజేశ్వర్, లింగన్న, భూమన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ని అరెస్టు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా రెజ్లర్స్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ని అరెస్టు చేయాలని ఏఐకేఎస్‌సీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీజేపీ ఎంపీని అరెస్టు చేయకపోవడాన్ని చూస్తుంటే, భేటీ బచావో, భేటీ పఢావో అనే నినాదం వట్టి బూటకం అని తేలిపోయిందన్నారు. 2016 నుంచి అనేకసార్లు రిపోర్టులు ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఆయన వేధింపులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరిత, వ్యకాసం రాష్ట్ర సహ కార్యదర్శి బొప్పని పద్మ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, గైని మురళి మోహన్, నాగెల్లి నర్సయ్య, తొడసం శంబు, ఎస్ఐఎఫ్ జిల్లా కార్యదర్శి అరవింద్ పాల్గొన్నారు.

పొన్కల్‌ను మండలంగా ప్రకటించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

నిర్మల్‌టౌన్: పొన్కల్ చుట్టుపక్కల గల 10 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వీడీసీ సభ్యులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 4న సీఎం కేసీఆర్ నిర్మల్‌కు వస్తున్నందున పొన్కల్‌ను మండల కేంద్రంగా ప్రకటింపజేయాలని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.



విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న కలెక్టరేట్

'దశాబ్ది'కి సిద్ధం

- కలెక్టరేట్‌లోనే రాష్ట్ర అవతరణ వేడుకలు
- జెండా ఆవిష్కరించనున్న మంత్రి ఐకేరెడ్డి
- ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్

నిర్మల్: తెలంగాణ రాష్ట్ర అవతరణోత్సవంతోపాటు దశాబ్ది ఉత్సవాల ప్రారంభానికి జిల్లా సిద్ధమైంది. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలోనే శుక్రవారం ఉదయం 9 గంటలకు అవతరణోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండా ఎగురవేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి సందేశం ఉంటుందని కలెక్టర్ వరుణ్‌రెడ్డి వివరించారు. ఈనెల 22 వరకు దశాబ్ది ఉత్సవాలు ఉన్న నేపథ్యంలో శుక్రవారం కార్యక్రమాన్ని సాదాసీదాగా చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అవార్డులు, సాంస్కృతిక కార్యక్రమాలను కుదించినట్లు తెలిపారు.

ముస్తాబైన జిల్లాకేంద్రం..

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు జిల్లా ముస్తాబైంది. ప్రధానంగా జిల్లాకేంద్రం విద్యుత్‌కాంతులు, మామిడి తోరణాలతో కళకళలాడుతోంది. కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

కేసీఆర్ సభ ఏర్పాట్లపై పరిశీలించిన మంత్రి



ఏర్పాట్లను చర్చిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: సీఎం కేసీఆర్ ఈనెల 4న జిల్లాకు రానున్న నేపథ్యంలో ఎల్లపల్లి శివారులో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను, సమీకృత కలెక్టరేట్ భవనాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. సభావేదిక, ట్రాఫిక్, పార్కింగ్, హెలీప్యాడ్ ప్రాంతాలను సందర్శించి రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. బహిరంగ సభవద్ద జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ చిలుక రమణ తదితరులు ఉన్నారు.

నిరసనను అడ్డుకున్న పోలీసులు



ఖాళీ కుర్చీని తొలగిస్తున్న ఎస్సై

ఖానాపూర్: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఖానాపూర్‌కు వచ్చిన సీఎం కేసీఆర్, ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. స్థానిక సమస్యలను ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 4న సీఎం జిల్లాకు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో కుర్చీ వేసి నిరసన తెలిపారు. ఇక్కడే కూర్చుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని తెలిపారు. దీంతో నాయకులు మరోచోట కుర్చీ వేసేందుకు యత్నించగా దానిని కూడా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తీరుపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నియంతపాలనకు పోలీసులు వంతపాడుతున్నారని విమర్శించారు. శాంతియుత నిరసనను అడ్డుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సదర్‌మాట్ ప్రత్యేక కెనాల్ సమస్యతోపాటు ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్, ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్న సత్యం, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, నాయకులు యూసుఫ్‌ఖాన్, తోట సత్యం, మడిగెల గంగాధర్, జంగిలి శంకర్, అమానుల్లాఖాన్, దొనికేని సాగర్, పంబాల రాజన్న, మల్లేశ్, నర్సయ్య, మైస శ్రీనివాస్, వెంకట్రాములు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

'జైతెలంగాణ' నినాదమే ఊపిరిగా..

- పోరు సాగించిన నిర్మల్ బిడ్డలు
- ప్రాణాలనూ అర్పించిన వీరులు
- 'అఖండజ్యోతి' సాక్షిగా.. తీరొక్క నిరసనలు
- స్వరాష్ట్రాన్ని సాధించుకుని తొమ్మిదేళ్లు
- నేటి నుంచి జిల్లాలో 'దశాబ్ది ఉత్సవాలు'



నిర్మల్‌లో ఉద్యమకారులకు మద్దతు తెలుపుతున్న ప్రస్తుత మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి(ఫైల్)

నిర్మల్: జై తెలంగాణ.. జైజై తెలంగాణ.. సరిగ్గా తొమ్మిదేళ్ల కిందట ఎటు చూసినా.. ఎక్కడ విన్నా.. ఇదే నినాదం. జనం గుండెల్లో చైతన్య ఊపిరులూదిన నాదం. చిన్న నుంచి పెద్దదాకా.. గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. సబ్బండవర్గాలు, సమస్త విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ, వ్యవసాయ, కార్మిక సంఘాలన్నీ ఏకమై స్వరాష్ట్ర సాధనోద్యమంలో భాగమయ్యాయి. పార్టీలకతీతంగా, జెండాలు, అజెండాలు పక్కన పెట్టి నాయకులంతా ఒక్కమాటపై పోరుబాటలో నడిచారు. అలాంటి చరితాత్మక ఉద్యమంలో చారిత్రక నేపథ్యమున్న పోరుగడ్డ నిర్మల్ ప్రాంతం సైతం కీలకంగా నిలిచింది. స్థానికంగా ఉద్యమించిన వాళ్లతో పాటు హైదరాబాద్, ఢిల్లీ వరకూ వెళ్లిన పోరుబిడ్డలు ఉన్నారు. స్వరాష్ట్రపోరులో కన్నీటి మరకలుగా భైంసాబిడ్డల బలిదానాలూ ఉన్నాయి. అలాంటి పోరును మరోసారి యాది చేసుకునే సందర్భం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నేటి రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి ఈనెల 22 దాకా 'తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు' నిర్వహిస్తోంది. రోజుకో శాఖతో తీరొక్క కార్యక్రమాలను చేపడుతోంది.

కడెం ఒడ్డు నుంచి బాసర గట్టుదాకా..

ప్రస్తుత నిర్మల్ జిల్లా ఉద్యమకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓ డివిజన్‌గా ఉండేది. ఇందులో 13 మండలాలు ఉండేవి. తెలంగాణ ఉద్యమంలో ప్రతీ మండలం తనదైన ప్రత్యేకతను చాటింది. తూర్పున కడెం నది ఒడ్డు నుంచి పశ్చిమాన గోదారమ్మ అడుగిడే బాసర గట్టు దాకా జోరుగా పోరు సాగింది. ఒక్కో తీరులో తమ స్వరాష్ట్ర కాంక్షను చాటారు.

- కడెం మండలంలో జేఏసీ నాయకులు కడెం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు పాద యాత్ర చేశారు.
- ఖానాపూర్ మండలంలో ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. అప్పటి ఎంపీ రాథోడ్‌రమేశ్‌కు వ్యతిరేకంగా నినదించింది. అప్పుడు పోలీసుల లాఠీదెబ్బలకు, కేసులకూ వెరవకుండా పోరాడారు. ఉద్యమకారుడు, అప్పటి విద్యావలంటీర్ల సంఘ రాష్ట్రనాయకుడు అమంద శంకర్ పొర్లుదండాలు పెడితే.. మహిళ నాయకురాలు విజయలక్ష్మి ఖానాపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు పాద యాత్ర చేశారు.
- మామడ మండలం పొన్కల్‌లో ఏకంగా అప్పటి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డినే అడ్డుకున్నారు. తెలంగాణ ఇచ్చేదాకా ఇటువైపు రావొద్దని నినదించారు.
- లక్ష్మణచాంద(ప్రస్తుత సోన్) మండలంలోని బొప్పారం గ్రామస్తులు ఉద్యమంలోనే ప్రత్యేకంగా నిలిచారు. గ్రామంలో 'అఖండ తెలంగాణ జ్యోతి'ని వెలిగించారు. స్వరాష్ట్రాన్ని సాధించే వరకూ ఆ జ్యోతి ఆరకుండా వెలిగించి.. అందరిలో ఉద్యమస్ఫూర్తిని రగిలించారు.
- లక్ష్మణచాంద నుంచి బాసర వరకు జేఏసీ నాయకులు పాదయాత్ర చేశారు. యువకులు ఆమరణ నిరాహారదీక్షకు దిగారు.



61జాతీయ రహదారిపై వంటావార్పు(ఫైల్)

- దిలావర్‌పూర్(ప్రస్తుత నర్సాపూర్‌తోపాటు) మండలం రాంపూర్‌లో యువకులు పోరులో భాగంగా ఓ బస్సు అద్దాలను పగలగొట్టి ఆవేశాన్ని చాటారు. తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాం కదిలి పాపహరేశ్వర ఆలయానికి వచ్చి స్వరాష్ట్రం రావాలని మొక్కుకున్నారు.
- కుంటాల మండలం ఓలకు చెందిన పోరుబిడ్డ కూస వనిత ముథోల్ మండలం కిర్గుల్(బి)లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభలో 'జైతెలంగాణ' అంటూ తెలంగాణ పాలికేక పెట్టింది.
- కుభీర్ మండలంలో వికలాంగుడైన పుప్పాల పీరాజీ తెలంగాణ వచ్చేదాకా చెప్పులు లేకుండానే తిరిగారు. మండల జేఏసీ రాస్తారోకోలు, వినూత్న నిరసనలు చేపట్టింది.
- తానూర్ మండలంలోని భోసిలో సాధారణ హోటల్ నడుపుకునే బామన రాఘవులు తొలిసారిగా జిల్లాలో మూడురోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.
- చదువుల తల్లి కొలువైన బాసరలోనూ ఉద్యమం కొనసాగింది. ఇక్కడి ట్రిపుల్‌ఐటీలో తెలంగాణం హోరెత్తింది. ఇక్కడ రైల్‌రోకోకూ ఉద్యమకారులు విఫలయత్నం చేసి లాఠీదెబ్బలను సైతం తిన్నారు.

భైంసాలో అమరవీరులు..

స్వరాష్ట్ర సాధనోద్యమంలో తెలంగాణ వ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలర్పించారు. అందులో భైంసా నుంచే ముగ్గురు అమరులు ఉన్నారు. స్థానిక సునార్‌గల్లీకి చెందిన నాంపెల్లి భాస్కరాచారి, టోపాయి రవి, సైలెందుల యోగేశ్ తెలంగాణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఇలాంటి అమర వీరుల ప్రాణ త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని ఎంతోమంది ఉద్యమకారులు, పార్టీ నాయకులు భైంసా వచ్చి.. వాళ్ల కుటుంబాలను ఓదార్చారు.

నిర్మల్ కేంద్రంగా..

తొలి నుంచీ పోరుగడ్డగా పేరున్న నిర్మల్‌లో తెలంగాణ ఉద్యమం అలు పెరుగకుండా సాగింది. అన్ని పార్టీలు జేఏసీగా ఏర్పడి ఉద్యమాన్ని ఊ రూరా తీసుకెళ్లాయి. ఉద్యమ కాలమంతా ప్రస్తుత కలెక్టరేట్ వద్ద ప్రతిరోజూ వినూత్న నిరసనలు, నిరాహార దీక్షలను చేపట్టారు. సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం, వంటావార్పు.. ఇలా పిలుపు ఏదైనా.. నిర్మల్ ప్రాంత వాసులు విజయవంతంగా పూర్తిచేశారు. స్వరాష్ట్ర సాధనోద్యమంలో నిర్మల్ పేరు సైతం గుర్తుండిపోయేలా ఉద్యమించారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో కారు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన కారు

ఇచ్చోడ: మండలంలోని ఇస్లాంనగర్ వద్ద రహదారిపై నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో గురువారం మధ్యాహ్నం ఆకస్మాతుగా మంటలు చెలరేగాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు కారు లోనుంచి దిగడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు 100కు తెలుపడంతో వారు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత



పట్టబడిన లారీలు

కడెం: మండలంలోని బెల్లాల్ సమీపంలోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక లారీలను గురువారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. పట్టబడిన లారీలకు రూ.20వేల జరిమానా విధించించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య హెచ్చరించారు.

పాక్షికంగా ఇల్లు దగ్ధం



ఇంటిని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని రాంజీగోండ్ నగర్‌కు చెందిన సోయం మహేందర్ ఇల్లు ప్రమాదవశాత్తు పాక్షికంగా కాలిపోయింది. వంట చేస్తున్నప్పుడు సిలిండర్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలు ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. సమయానికి మంటలు ఆర్పి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్న అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలియచేశారు. వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ విషయంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామస్తులు బయటికి వెళ్లే సమయంలో ఇంట్లో దీపాలు ఆర్పి బయటికి వెళ్లి తగు జాగ్రత్తలు తెలియచేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలికకు వరుసకు మేనబావతో వివాహం జరుపుతున్నారనే సమాచారం మేరకు ఐసీడీఎస్, ఐసీపీఎస్, రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డుకుని బాలిక తల్లిదండ్రులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహంతో కలిగే నష్టాలను వివరించారు. వివాహ వయస్సు వచ్చిన అనంతరం పెళ్లి చేయాలని, లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సుమతి, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, అంగన్‌వాడీ టీచర్ గంగామణి, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, ఏఎస్ఐ మాన్‌సింగ్, ఆర్ఐ వేణుగోపాల్, న్యాయవాది నరేందర్ పాల్గొన్నారు.

బైక్ పైనుంచి పడి ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: బైక్‌పై నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం నిర్మల్ రూరల్ మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన పోగులు దత్తాద్రి మండలంలోని కనకాపూర్ గ్రామానికి పని నిమిత్తం వెళ్లాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో కనకాపూర్ జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మహిళకు గాయాలు....

మండల కేంద్రానికి చెందిన సుంకరి చిన్నమ్మ (55) గురువారం చేనుకు వెళ్లింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఇంటికి తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై వస్తుండగా బైక్‌పై నుంచి కింద పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

‘ఆశ్రమ’ సీఆర్టీలకు తీపి కబురు

- 12నెలల వేతనానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 1,126 మందికి ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న సీఆర్టీలు



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (ఫైల్)

ఉమ్మడి జిల్లా సీఆర్టీల వివరాలు..

జిల్లా	సీఆర్టీల సంఖ్య
నిర్మల్	143
ఆదిలాబాద్	450
మంచిర్యాల	103
కుమురంభీం	430

నిర్మల్‌ఖిల్లా: ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లకు (సీఆర్‌టీ) రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇప్పటికే ఇతర శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల పెంపు వంటి ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం, ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీలకు కూడా ఏడాది కాలంపాటు పూర్తి వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 1126 మందికి ప్రయోజనం కలుగనుంది.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ) పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచారు. సీఆర్‌టీల వేతనం కూడా పెంచి నెలకు ఎస్జీటీలకు రూ.21,255, స్కూల్ అసిస్టెంట్లకు రూ.28,977 అందజేస్తున్నారు. ఒక విద్యా సంవత్సరంలో ఏప్రిల్ లోని చివరి పనిదినం వరకు అనగా పదిన్నర నెలలు మాత్రమే వీరికి వేతనం అందించే వారు. వేసవి సెలవుల్లో వేతనం ఇచ్చేవారు కాదు. వేసవి సెలవుల్లో కూడా తమకు వేతనం అందజేయాలని సీఆర్‌టీలు గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వీరి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం 12 నెలల వేతనం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం 2022–23 విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లాలో 160మంది సీఆర్‌టీలకు ప్రయోజనం..

నిర్మల్ జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 17ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్ టీచర్లతో పాటు 143 మంది సీఆర్‌టీలు పని చేస్తున్నారు. వీరిలో 60మంది ఎస్జీటీలు, 83మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గత విద్యా సంవత్సరం (2022–23) నుంచి వీరందరికీ 12 నెలల వేతనం అందనుంది. ప్రభుత్వ నిర్ణయంపై సీఆర్‌టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని, రెగ్యులరైజ్ చేయాలని సీఆర్‌టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



సీఆర్‌టీలకు పదిన్నర నెలల వేతనం కాకుండా ఏడాది కాలానికి పూర్తి వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాం. మా విజ్ఞప్తులకు సానుకూలంగా ప్రభుత్వం స్పందించి సముచిత నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. సీఆర్‌టీలు గత 20ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. మా ఉద్యోగాలనూ రెగ్యులరైజ్ చేస్తే సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మునినాయక్, జిల్లా ఆశ్రమ పాఠశాలల, సీఆర్టీల సంఘం అధ్యక్షుడు, నిర్మల్

12 నెలల వేతనం హర్షణీయం..



రెండు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ పేరుతో విధుల్లో చేరిన వీరంతా 20ఏళ్లుగా బోధన చేస్తున్నారు. రాష్ట్రం వచ్చిన తరువాత ఎన్నోసార్లు పలు పద్ధతుల్లో ప్రభుత్వానికి విన్నవించుకుంటూ వస్తున్నాం. 12నెలల వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయం.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూ అధ్యక్షుడు, నిర్మల్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు
- ఉమ్మడి జిల్లా సమస్యలపై సీఎం స్పందించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఖానాపూర్: సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులను సైతం కేసీఆర్ ప్రభుత్వం కాలరాస్తు, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందన్నారు. ఖానాపూర్ మండలంలో నిర్మించే సదర్‌మాట్ బ్యారేజిని నిర్మల్‌కు తరలించడంతో పాటు ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని వివరించారు. వేలాదికోట్లతో తెచ్చిన మిషన్ భగీరథ కమీషన్ భగీరథగా మారిందని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం తాగునీరు అందక గిరిజనులు, పేదల గొంతు తడుపుకునేందుకు నానా ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ప్రజల ఇక్కట్లపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ‘‘నీటిగోసపై కాంగ్రెస్ పోరు’’ పేరుతో ఆందోళనలు చేపడుతామన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలం అయ్యారన్నారు. కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శాంతియుతంగా నిరసనలు కూడా తెలుపకుండా పోలీసులు 30 ఆక్ట్ పేరుతో అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేశ్, నాయకులు తోట సత్యం, ముషీర్, మల్లేశ్, సత్తన్న, తదితరులున్నారు.

పదేండ్ల పోస్టర్ ఆవిష్కరించిన కేటీఆర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ఇచ్చోడ: పదేండ్ల వైభవ పోస్టర్‌ను మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ముఖరా(కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్లలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ పల్లెప్రగతి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో గ్రామాలు జీవం పోసుకున్నాయని తెలిపారు. పదేండ్ల కాలంలో ముఖరా కె గ్రామం అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా ఎన్నో అవార్డులు ముఖరా కె పంచాయతీ దక్కించుకున్నాదని తెలిపారు. గ్రామాల్లో పల్లెప్రగతి ఫలాలు ప్రజలకు చేరుతున్నాయని అందుకు ముఖరా(కె) నే ఉదాహరణగా చెప్పుకోవచ్చని తెలిపారు.

ధూపదీప నైవేద్యానికి నిధుల పెంపు

- రూ.10వేలు పెంచుతూ కేసీఆర్ నిర్ణయం
- జిల్లాలో 103 ఆలయాలు కొత్తగా స్కీంలోకి..
- అర్చకుల్లో హర్షాతిరేకాలు



జిల్లాలోని వివరాలు..

ధూపదీప నైవేద్యం అమలవుతున్న ఆలయాల సంఖ్య: 148	
మొదటి విడత దరఖాస్తు చేసుకున్న వారు: 59	
రెండవ విడత దరఖాస్తు చేసుకున్న వారు: 159	
మూడో విడత దరఖాస్తు చేసుకున్న వారు: 103	

నిర్మల్‌చైన్‌గేట్: ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాల నిర్వహణకు ధూపదీప నైవేద్యం పథకం కింద ఇస్తున్న వేతనం, పడితరం ఖర్చులకు రూ.10 వేలు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ బుధవారం ప్రకటించగా.. జిల్లాలోని 148 ఆలయాలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటివరకు జిల్లాలో 148 ఆలయాలకు అర్చకుడి వేతనం రూ.4వేలు, ఇతర ఖర్చులకు రూ.2వేలు మొత్తం రూ.6వేల చొప్పున ఆలయ ఖాతాల్లో జమయ్యేవి. అయితే ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు.

కొత్తగా 103 ఆలయాలు..

ధూపదీప నైవేద్యం కింద మొదటి విడతగా జిల్లాలో 59 ఆలయాలు రెండో విడతలో 159 ఆలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నుంచి అనర్హులను తొలగించి రాష్ట్ర ప్రభుత్వం 162 మందిని గుర్తించింది. అనివార్య కారణాలతో 14మంది తమ విధులను హాజరు కావడం లేదు. దీంతో జిల్లాలో 148 ఆలయాల్లో ధూపదీప నైవేద్య పథకం అమల్లో ఉంది. మూడో విడతలో భాగంగా జిల్లాలో 103మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. వీటికి కూడా పథకం వర్తిస్తే జిల్లాలో ఆలయాల సంఖ్య 253కు పెరగనుందని జిల్లా దేవాదాయ శాఖ అధికారి రవికిషన్ తెలిపారు.

2007లో ప్రారంభం...

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాలు శిథిలావస్థకు చేరగా 2007లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ఆలయాలపై దృష్టి సారించారు. ఆలయాలు మూతబడవద్దనే ఉద్దేశంతో అర్చకుల వేతనం రూ.2వేలు, ఇతర ఖర్చులు రూ.500 కలిపి రూ.2500 ఆలయ ఖాతాల్లో జమయ్యేలా చూశారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ మొత్తాన్ని రూ.6వేలకు పెంచారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో రూ.6వేలు సరిపోవడం లేదంటూ అర్చకులు కొంత కాలంగా ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు వారి వేతనాన్ని రూ.10 వేలకు పెంచడంతో వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇక వేద పండితులు, శాస్త్ర పండితులకు చెల్లించే గౌరవ వేతనాన్ని కూడా రూ.2500 నుంచి రూ.5,000కు పెంచారని, ఈ భృతి పొందే వయసును 75ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గించారు.

వేతన పెంపు సంతోషదాయకం

దూప దీప నైవేద్యం కింద తెలంగాణ సర్కార్ పదివేల రూపాయలు ఇవ్వడం సంతోషదాయకం. గతంలో 6000 వచ్చే జీతం రూ.10వేలుగా మార్చడం ఎంతో సంతోషం. అదేవిధంగా దూప దీప నైవేద్యం కింద పురాతన దేవాలయాలలో పనిచేసే అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించి బ్రహ్మణులు ఆదుకోవాలి. కేసీఆర్ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సిరిగే రమేష్ శర్మ, ధూప దీప నైవేద్య రాష్ట్ర కార్యదర్శి

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-09 బ్యాచ్ విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొట్టమొదటి బ్యాచ్ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను కలిసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. 15ఏళ్లకు కలుసుకున్నవారంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువులునేర్పిన ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాజారెడ్డి, నవీన్‌కృష్ణ, వెంకట్‌రావు, వరప్రసాద్, వెంకటరమణ, సుభాష్, నాగభూషన్ ఉన్నారు.

‘కవ్వాల్’లో అడవికుక్కల బెడద

- అభయారణ్యంలో పెరిగిన కుక్కల సంఖ్య
- పులినైనా ఎదిరించే సత్తా
- భయంతో అడవిలో కాలుపెట్టేందుకు బెబ్బులి వెనుకడుగు



అడవి కుక్కలు

జన్నారం(ఖానాపూర్): అడవి కుక్కలకు పులులు కూడా భయపడుతాయి. వన్యప్రాణులను హడలెత్తించే బెబ్బులి కూడా అడవికుక్కలను చూసి వెనుదిరుగుతుంది. పులి వేటాడిన జంతువును అడవికుక్కలు లాక్కుపోతాయి. పులికి ఎదురు తిరిగే అడవి కుక్కల సంఖ్య పెరుగుతుండడంతో కవ్వాల్ అభయారణ్యంలో కాలుపెట్టడానికి పులి వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. వన్యప్రాణులను భయపెట్టే బెబ్బులి అడవి కుక్కలను చూసి భయపడుతుందా? అంటే అటవీశాఖ అధికారులు నిజమే అంటున్నారు. కొన్నిరోజులు రాకపోకలు కొనసాగించిన పులి ఏడాది కాలంగా కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో అడుగు పెట్టడం లేదు.

పులులకు అనువైన ప్రాంతం..

దట్టమైన అటవీ ప్రాంతం.. రకరకాల వన్యప్రాణులు.. పులి ఉండేందుకు అనువైన ఆవాసాలు.. జలపాతాలు.. కలబోసిన కవ్వాల్ అడవులు. ఈ అడవులు పులులకు అనువుగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం 2012 ఏప్రిల్ మాసంలో కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసింది. టైగర్‌జోన్ అడవులను 892.23 స్క్వేర్ కిలోమీటర్ల కోర్ ఏరియా, 123.12 స్క్వేర్ కిలోమీటర్ల బఫర్ ఏరియాగా గుర్తించారు. కవ్వాల్ టైగర్‌జోన్‌కు సమీపంలో మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్, టైగర్ రిజర్వ్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్‌జోన్ ఉంటాయి. ఆయా టైగర్‌జోన్లలో పులుల సంఖ్య ఎక్కువ కావడంతో కవ్వాల్ టైగర్ జోన్‌లోకి ప్రవేశించే అవకాశాలున్నాయి. పులులకు అనువైన ప్రాంతంగా, ఇక్కడ పదికి పైగా పులులకు సరిపడా వన్యప్రాణులు, ఆవాసాలు ఉన్నందువల్ల ఇక్కడికి పులులు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

టైగర్‌జోన్‌లో 240 వరకు అడవికుక్కలు

పులికి ఎదురు తిరిగే అడవి కుక్కలు అడవిలో ఎక్కువగా ఉండడం కూడా పులి రాకపోవడానికి ఒక కారణమని చెప్పవచ్చు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డుల ప్రకారం సుమారుగా 240 వరకు అడవి కుక్కలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో సుమారుగా 120 వరకు అడవి కుక్కలున్నట్లు తెలుస్తోంది. 10 నుంచి 12 వరకు గ్రూపుగా ఉంటూ దాడికి దిగుతాయని, ఇలాంటి గ్రూపులు జన్నారం డివిజన్‌లో 10 వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పులి ఇక్కడ ఉండక పోవడానికి అడవి కుక్కల బెడద కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చంటున్నారు.

ఎదురు తిరిగే సత్తా

వన్యమృగాల్లో ఒకటైన అడవి కుక్కలకు ఏ జంతువు పైన అయినా ఎదురు తిరిగే సత్తా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. జింకలు, నీలుగాయి, సాంబర్లు, చిరుత, పులి, ఎలుగుబంటి వంటి వన్యమృగాలపై కూడా అడవికుక్కలు గుంపులుగా దాడికి పాల్పడుతాయి. అందుకే అడవి కుక్కల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట పులులు, చిరుతలు ఉండవని అధికారులు చెబుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో దట్టమైన అడవులు, లోయలు ఎన్నో ఉన్నాయి. వీటిలోనే చిరుతలు, పులులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయి. అయితే ఆయా ప్రాంతాల్లో కూడా కుక్కలు తిరుగుతూ పులులు వేటాడిన మాంసాన్ని లాక్కునివెళ్లి తింటాయి. అడవి కుక్కల సంఖ్య మరింత పెరిగితే వన్యప్రాణులకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

సంఖ్య పెరిగింది



కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం డివిజన్ 12 శాతం మాత్రమే ఉంది. ఇక్కడ పులికి అనువైన ప్రదేశాలున్నాయి. జన్నారం అటవీ డివిజన్‌లో ఇటీవల అడవి కుక్కల సంఖ్య పెరిగింది. పులి రాకపోవడానికి అవి కూడా ఒక కారణం కావచ్చు. గతంతో పోలిస్తే డివిజన్‌లో అడవి కుక్కల సంఖ్య రెండు రెట్లు పెరిగినట్లు తెలుస్తోంది.

– సిరిపురం మాధవరావు, ఫారెస్ట్ డివిజనల్ అధికారి

పాక్‌పట్లలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



భీమన్న ఆలయం ప్రారంభిస్తున్న మంత్రి

నర్సాపూర్(జి): రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని.. త్వరలో మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన భీమన్న ఆలయం, రూ.4 లక్షలతో నిర్మించిన నాయక్‌పోడ్ సంఘ భవనాలను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మంత్రి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఈనెల రెండో తేదీ నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. సీసీ రోడ్ల పనుల బిల్లులను ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. రాంపూర్ పంచాయతీతోపాటు దాని అనుబంధ గ్రామాలైన దర్యాపూర్, నసీరాబాద్‌లో రూ.కోటి రూపాయలతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామన్నారు. గ్రామానికే చెందిన మైనార్టీ సోదరులు మజీద్‌కు ప్రహరీ, సీసీ రోడ్డుకు నిధులు కేటాయించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవింద్‌రెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, నర్సాపూర్(జి) సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సుభాశ్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, బస్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, కొండ్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, నడిపొల్ల రవి, అధికారులు పీఆర్ డీఈ తుకారాం, ఏఈ సూర్య తేజాగౌడ్, ఎంపీడీఓ అల్లాడి వనజ, ఇన్‌చార్జి తహసీల్దార్ సుమతి, ఆర్ఐ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్ పాల్గొన్నారు.

20 లీటర్ల ‘మహా’ మద్యం పట్టివేత

భైంసాటౌన్: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నజీర్ హుస్సేన్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ముథోల్-ఎల్వత్ మార్గంలో తనిఖీ చేపట్టగా ఓ వ్యక్తి వద్ద నుంచి 20 లీటర్ల మహారాష్ట్ర మద్యం సీసాలు లభించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రమేశ్‌గౌడ్, కానిస్టేబుళ్లు శైలేశ్, సంతోష్, తదితరులున్నారు.

మొసళ్ల కోసం రెస్క్యూ ఆపరేషన్



మల్లాపూర్ చెరువులో పెట్టిన బోను

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ చెరువులోని మొసళ్లను పట్టుకోవడం కోసం అటవీశాఖ అధికారులు రెస్క్యూ ఆపరేషన్ మొదలుపెట్టారు. కొద్ది రోజుల కిందట చెరువులో రెండు మొసళ్లను గుర్తించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. చెరువులో నీళ్లు ఎక్కువ ఉండడంతో వాటిని పట్టడం కష్టమని తెలుపడంతో చెరువులోని నీటిని కిందకు వదిలారు. దీంతో గురువారం అటవీశాఖ డిప్యూటీ ఎఫ్ఆర్వో నజీర్‌ఖాన్ ఆధ్వర్యంలో చెరువులో రెస్క్యూ ఆపరేషన్ మొదలుపెట్టారు. బోనులు తెచ్చి చెరువులో ఉంచారు. అందులో చేపలు, చికెన్ ఉంచామని, వాటిని తినడానికి వచ్చి అందులో చిక్కుకునే అవకాశం ఉంటుందని అటవీశాఖ అధికారులు నజీర్‌ఖాన్ తెలిపారు. ఇందులో సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ కేశం శ్రీనివాస్, ఎఫ్‌బీవో సుమన్ ఉన్నారు.